సమస్యల వలయంలో టిడ్కో కాలనీ

- కంపుకొడుతున్న డ్రెయినేజీలు
- ఎక్కడి చెత్త అక్కడే..
- అటకెక్కిన పారిశుద్ధ్య పనులు
- తాగేందుకు నీరు లేక ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



టిడ్కో కాలనీలో పేరుకుపోయిన చెత్త



ఆందోళన చేస్తున్న టిడ్కో కాలనీ మహిళలు

గుడివాడరూరల్: టిడ్కో కాలనీలో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కాలనీలో పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో కాలనీలో ఎటు చూసినా చెత్త దర్శనమిస్తోంది. కాలనీలో ఉన్న డ్రెయినేజీలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ విషయాన్ని అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల గురించి అధికారులకు తెలిపేందుకు వెళ్తే టీడీపీ కార్యాలయానికి వెళ్లాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. కాలనీలో ఎటు చూసినా డ్రెయినేజీలు నిండి కంపుకొడుతున్నాయని, ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో దోమలు విజృంభించి చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి సమయాల్లో అల్లాడిపోతున్నారని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని తాము మనుషులం కాదా అని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



టిడ్కో కాలనీలో డ్రెయినేజీ నిండి దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు

వారానికి మూడు రోజులే నీటి సరఫరా

టిడ్కో కాలనీలోని ఇళ్లలో 80 శాతం మేర ప్రజలు జీవిస్తున్నారని కేవలం వారంలో మూడు రోజులు మాత్రమే మున్సిపల్ వాటర్ విడుదల చేస్తున్నారని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. కనీసం నీరు ఏ సమయంలో వస్తుందో కూడా తెలియడం లేదని, ఒకవేళ నీరు వస్తే కేవలం 10 నిముషాల్లో ఆగిపోతుందని ఆరోపిస్తున్నారు. తాగేందుకు, వాడుకునేందుకు చుక్క నీరు లేక అల్లాడుతున్నామని వాపోతున్నారు. తాము అద్దె ఇళ్లల్లో ఉండలేక ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లల్లో ఉంటున్నామని, తమను ఎవరూ పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఓట్ల సమయంలో వచ్చే నాయకులు గెలిచిన తర్వాత కనీసం తాము ఉన్నామో, పోయామో అనే విషయాలపై ప్రస్తావించకపోవడం దారుణమని కాలనీవాసులు కన్నీటిపర్యంతమయ్యారు. రోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పాలకులు, అధికారులకు తెలిపినా చర్యలు మాత్రం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీరోడ్డుపై నిలిచిన మురుగునీరు

బెంబేలెత్తిస్తున్న వ్యాధులు

కాలనీలో పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో అంటు వ్యాధులు కాలనీ వాసులను బెంబేలెత్తిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరాలు, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి టిడ్కో కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వర్షాలు వస్తే ఇళ్లల్లోకి మురుగు



చిన్నపాటి వర్షాలు వస్తే కాలనీలో డ్రెయినేజీలు పొంగి మురుగునీరు, వర్షం నీరు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. దీని వల్ల రోజుల తరబడి మురుగునీటిలోనే గడపాల్సి వస్తోంది. మా సమస్యలను అధికారులు, పాలకులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మాకు మెరుగైన వసతులు కల్పించాలి.

– దాసరి ఆదిలక్ష్మికుమారి, టిడ్కో కాలనీవాసి

పూడిక తీత పనులు చేయట్లేదు



కాలనీలో చెత్త తొలగించేందుకు రెండురోజులకు ఒకసారి వస్తారు. ఇళ్లల్లో వాడుకునే చెత్తను తీసుకెళ్లడం లేదు. డ్రెయినేజీల పూడిక తీయకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. రాము ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒక్కసారి అయినా కాలనీని సందర్శించిన పాపానపోలేదు. గుడివాడ అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే మినహా మా గురించి పట్టించుకోవడం లేదు.

– ఎస్.ధనలక్ష్మి, కాలనీవాసి

మౌలిక వసతులు కల్పించాలి



కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలి. సెప్టిక్ ట్యాంక్ నిండి నెల రోజులు కావడంతో డ్రెయినేజీల్లో కలసి కంపుకొడుతోంది. తాగునీరు లేక అల్లాడుతున్నాం. వారానికి మూడురోజులు తాగునీరు ఇవ్వడం సరికాదు. మాకు రోజూ తాగునీరు అందించాలి. అధికారులు, పాలకులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– పరిటాల జ్యోతి, కాలనీవాసి

ప్రభుత్వమే ఆదుకోవాలి



వారంలో మూడురోజులు మాత్రమే తాగునీరు అందిస్తున్నారు. తాము ఒకవేళ పనికి వెళ్తే నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. అద్దెలు కట్టుకోలేక ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లల్లో నివాసముంటున్నామని, ప్రభుత్వం, అధికారులు కల్పించాల్సిన కనీస వసతులు కూడా కల్పించడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– వసంత శేషుకుమారి, కాలనీవాసి

నాల్గో రోజూ ఘనంగా గణపతి ఉత్సవాలు

గుడివాడరూరల్: మండలంలోని గణపతి నవరాత్రుల ఉత్సవాలు శనివారం నాల్గో రోజూ ఘనంగా నిర్వహించారు. నీలామహల్‌రోడ్డులో చిన్నారులు ఏర్పాటు చేసిన బాలగణపతి వీర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు బన్ని, చెర్రి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని మోటూరు, దొండపాడు, చౌటపల్లి, తటివర్రు, రామనపూడి, బిళ్లపాడు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

పమిడిముక్కలలో..


పమిడిముక్కల: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గుర్రాల్లంకలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి ఉత్సవాలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆదివారం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వీర గణపతిగా..

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా స్వామి వారిని శనివారం వీర గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గణేష్ ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. గురజ సీతారామాలయంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పూజలు చేసి విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కైకలూరు రోడ్డులోని వినాయక విగ్రహానికి, పెయ్యేరు కాలనీలో వినాయకుడి విగ్రహానికి ఎంపీపీ పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుబాబు, రామకృష్ణ, చంటి, సాక్షి సాయిబాబు, భుజేశ్వరరావు, వసంతరావు, కోటేష్, పృధ్వీ, సతీష్ పాల్గొన్నారు.



గుడివాడ నీలామహల్ రోడ్డులో గణపతి



వీరగణపతి అలంకరణలో స్వామి

లడ్డూ ప్రసాదం వేలం

మండవల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ రామకృష్ణ మందిరంలో వినాయకుడికి సమర్పించిన లడ్డూ ప్రసాదానికి శనివారం వేలం పాట నిర్వహించారు. నల్లిబోయిన చింతయ్య రూ.6,900కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ మందిరంలో ఐదేళ్లుగా విగ్రహం, లడ్డూ దాతగా బత్రాజు ఫణీంద్రబాబు వ్యవహరిస్తున్నారు.



గుర్రాల్లంకలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



గురజలో గణేష్ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎంపీపీ

అయ్యంకిలో..

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో పామర్రు రోడ్డులో ఏర్పాటు చేసిన పందిలోని విఘ్నేశ్వరుడు నాలుగు రోజులుగా పూజలందుకుంటున్నారు. శనివారం అయ్యంకి పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీరని సమావేశాలెందుకు?

మండల సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు

పమిడిముక్కల: సమస్యలు తీరని సమావేశాలెందుకని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించారు. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే సమావేశాలకు వస్తామని తేల్చి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని సమస్యలపై అధికారులను నిలదీశారు. నాలుగు సమావేశాల నుంచి తాము చెప్పిన సమస్యలు పరిష్కారం కాలేదని, సమావేశాల వల్ల ఉపయోగం లేదని, ప్రజాప్రతినిధులకు గౌరవం లేదని ఆరోపించారు. తాను చేసిన పనులకు సంబంధించి రెండు సంవత్సరాలుగా బిల్లులు చెల్లించడం లేదని, ఎంబుక్ కనబడలేదని చెబుతున్నారని, ఈ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని కూడేరు ఎంపీటీసీ సభ్యుడు వీర్ల ఆదిశేషు నిలదీశారు. తమ గ్రామానికి మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు మంజూరయ్యాయని, పనులు చేపట్టేందుకు సర్పంచ్ తీర్మానం ఇవ్వడం లేదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని లంకపల్లి ఎంపీటీసీ సభ్యుడు సజ్జాద్ అలీ, కోఆప్షన్ సభ్యుడు దియానత్ అలీ తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదన్నారు. పంచాయతీ కార్యాలయం తాళాలు గ్రామంలో డ్వాక్రా మహిళ వద్ద పెట్టారని, తన అనుమతి లేకుండా కార్యాలయం బయట వాళ్లకు ఎలా ఇస్తారని లంకపల్లి సర్పంచ్ వేమూరి రత్నకుమారి ఏపీఎం వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. గ్రామైక్య సంఘంలో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

మంటాడలో పంచాయతీ భవన నిర్మాణ పనులు చేశామని, బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని ఎంపీటీసీ లక్ష్మి తెలిపారు. గ్రామాల్లో సభలు, సమావేశాలు జరిగేటప్పుడు సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా, అధికార పార్టీ నాయకులతో నడుపుతున్నారని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ఆరోపించారు. ప్రోటోకాల్ ప్రకారం నడుచుకోవాలని, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ కార్యదర్శులకు సూచించారు. ఎంపీటీసీ, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి చర్య తీసుకొంటానని సభ సజావుగా సాగేలా సహకరించాలని ఎంపీడీఓ సీతారామరాజు ప్రజాప్రతినిధులను కోరారు. ప్రతిసారి ఇలాగే జరుగుతుందని, తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే సమావేశానికి వస్తామని ఎంపీపీతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య పాల్గొన్నారు.

నేడు శ్రీ వెంకటేశ్వరుని మాస కల్యాణం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల అధిక సంఖ్యలవిచ్చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

■ రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ఇన్సూరెన్స్

మండవల్లి: రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రయోజనం కలిగే ఇన్సూరెన్స్ పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరి తమ కుటుంబానికి రక్షణ కల్పించుకోవాలని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ గోపాలరావు అన్నారు. గన్నవరంలో శనివారం గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

■ గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి



గుడివాడ టౌన్: మాతృభాషను అందరూ గౌరవించాలని దానిని విడనాడకూడదని సమాజానికి తెలియజేసిన సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి పంతులు అని సాహితీ స్రవంతి నాయకులు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సాహితీ స్రవంతి పట్టణ అధ్యక్షుడు లంక సురేంద్ర, వై. కోటేశ్వరరావు, ఎం. వెంకటేశ్వరరావు, వి. కె. కిషోర్ పాల్గొన్నారు.

■ వృద్ధురాలిపై దాడి.. కేసు నమోదు

కైకలూరు: వృద్ధురాలిపై దాడి ఘటనలో ఓ తండ్రీ కొడుకులపై రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు గుమ్మళ్లపాడు గ్రామానికి చెందిన చిట్టి మరియమ్మ ఈ నెల 28న బయటకు వెళ్లి వచ్చి చూస్తే ఇంటి ఆవరణ చుట్టూ దడిని గేదలు తొక్కి చిందరవందర చేశాయి. దీంతో ఆమె తిట్టుకుంటుండడంతో.. తమనే ఆమె తిడుతుందని భావించిన సమీప కొండపల్లి మాణిక్యాలరావుతో పాటు అతని కుమారుడు రాజేష్ వృద్ధురాలిపై దాడి చేశారు. మరియమ్మ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

■ గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై శనివారం అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. ఏఎస్ఐ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: పాఠశాల విద్యార్థులు స్పర్శను జాగ్రత్తగా గమనించాలని ఆలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పార్థసారథి చెప్పారు. విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌లపై ఐసీడీఎస్ సిబ్బందితో కలసి శనివారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న మాట్లాడుతూ బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు, పోలీసు సిబ్బందికి ధైర్యంగా చెప్పాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అశ్రద్ధ వద్దు



కలిదిండి(కైకలూరు): రక్షిత మంచి నీటి సరఫరాలో సిబ్బంది అశ్రద్ధ వహించొద్దని కలిదిండి ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర పేర్కొన్నారు. తాడినాడ గ్రామీణ సమగ్ర రక్షిత మంచి నీటి సరఫరా పథకం(సీపీడబ్ల్యూఎస్) పనితీరును శనివారం పరిశీలించారు. నీటి నాణ్యత పరీక్షలను స్వయంగా చేశారు. కొన్ని శాంపిల్స్‌ను ఏలూరుకు పంపించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వాటర్ స్కీం పనితీరు బాగుందన్నారు. ఇక్కడ ఫేజ్–2లో చినతాడినాడ, పోతుమర్రు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే చినతాడినాడలో కొంత పైప్‌లైన్ పనులు జరిగాయన్నారు. ఏడాదిలోపు పనులు పూర్తవుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ రమేష్ బాబు, తాడినాడ సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి వెండి వస్తువులు బహూకరణ



బంటుమిల్లి: మండలంలోని కంచడంలో ఉన్న శ్రీకాత్యాయని సమేత కనకలింగేశ్వరస్వామి(శివాలయం)కి శనివారం భక్తులు సుమారు రూ. లక్ష విలువ చేసే వెండి శఠగోపం, పళ్లెం బహూకరించారు. గ్రామానికి చెందిన గుడిశేవ మామిళయ్య కుమార్తె సీతాల ధనలక్ష్మి పామర్రు మండలం, జమిదగ్గుపల్లి గ్రామంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ధనలక్ష్మి, హనుమంతరావు దంపతులు స్థానిక శివాలయంలో స్వామి మొక్కు తీర్చుకునే భాగంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బండారు చంద్రశేఖర్ సమక్షంలో వెండి వస్తువులను ఆలయ అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు విశేష హారతులు

గుడ్లవల్లేరు: మండంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి వేద పండితులు శనివారం విశేష హారతులను ఇచ్చారు. అమ్మవారికి నక్షత్ర హారతి, పంచ హారతి, సింహ హారతి, సర్ప హారతి, కుంభ హారతి, కర్పూర హారతులను ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీ సభ్యుల నియామకం

కైకలూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కలిదిండి, మండవల్లి మండలాల అనుబంధ విభాగాల కమిటీల్లో పలువురిని శనివారం నియమించారు. ఈ మేరకు తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి నియమితులైన వారి జాబితా విడుదలైంది.

కలిదిండి మండలంలో..

దుగ్గిరాల రమేష్ (యూత్ వింగ్), ఇమ్మానేని రమాదేవి (మహిళా విభాగం), నీలపాల సుబ్బయ్య(రైతు విభాగం), గూడవల్లి రాజశేఖర్ (బీసీ సెల్), బందెల అమ్మన్ (జానీ, ఎస్సీ సెల్), చిప్పాడ శ్రీను (ఎస్టీ సెల్), ఫిరోజ్‌ఖాన్ (మైనార్టీ సెల్), గరికిముక్కల రత్నకుమార్ (క్రిస్టియన్ మైనార్టీ సెల్), అగ్నిహోత్రం పవన్ కుమార్ (స్టూడెంట్ వింగ్), రావడి నాగబాల బాలాజీ (పంచాయతీరాజ్ వింగ్), దేమిరెడ్డి సాంబశివరెడ్డి (వలంటరీస్ వింగ్), రామనాథం శ్రీనివాసరావు(వీవర్స్ వింగ్), అంకెం నరసయ్య (వాణిజ్య విభాగం), ఇమ్మానేని లక్ష్మణరావు (వైఎస్సార్ టీయూసీ), నీలపాల భవానీ(అంగన్‌వాడీ వింగ్), తిరుమాని బ్రహ్మం (కల్చరల్ వింగ్), బేతాళ సన్ని (సోషల్ మీడియా వింగ్), జి.నాగరాజు (దివ్యాంగుల విభాగం), చెన్నంశెట్టి సోమేశ్వరరావు (పబ్లిసిటీ వింగ్), రేవు నరసింహారావు (బూత్ కమిటీ వింగ్)గా నియమించారు.

మండవల్లి మండలంలో..

చేబోయిన శ్రీనివాసరావు (యూత్ వింగ్), వెలగపూడి బేబీ సరోజిని (మహిళా విభాగం), బుర్ల భోగేశ్వరరావు (రైతు విభాగం), బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ (బీసీ సెల్), నేతల నాగరాజు (ఎస్సీ సెల్), నల్లకొండ నాగరాజు (ఎస్టీ సెల్), షేక్ ఇస్మాయిల్ (మైనార్టీ సెల్), జంగం రామదాసు (క్రిస్టియన్ మైనార్టీ సెల్), నాగతోట ఫిటర్ ఇబినేజర్ (స్టూడెంట్ వింగ్), పెరుమాళ్ళ వీర వెంకట సత్యనారాయణ (పంచాయతీరాజ్ వింగ్), కొంద్రు రమ్య (వలంటరీస్ వింగ్), వల్లూరి దుర్గ (వీవర్స్ వింగ్), పెరుమాళ్ల శివారెడ్డి (వాణిజ్య విభాగం), తోట శివాజీ (వైఎస్సార్ టీయూసీ), కురేళ్ళ స్వప్నలత (అంగన్‌వాడీ వింగ్), చోరీ పేతురు (కల్చరల్ వింగ్), వల్లూరి శివరామకృష్ణ(సోషల్ మీడియా వింగ్), కాగిత నాగబాబు (దివ్యాంగుల విభాగం), దూసనపూడి నాంచారయ్య (పబ్లిసిటీ వింగ్), ఆకునూరి చిట్టిబాబు (బూత్ కమిటీ వింగ్) నియమితులయ్యారు.

క్లుప్తంగా

కార్యదర్శి రమేష్‌కు సత్కారం



పమిడిముక్కల: కార్యదర్శి రమేష్ సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు పేర్కొన్నారు. పమిడిముక్కల కార్యదర్శిగా పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ చేసిన రమేష్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, ఎంపీడీఓ సీతారామరాజు, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బంది సత్కరించారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ జయప్రదం చేయాలని జిల్లా జడ్జి గుట్టల గోపి కోరారు. శనివారం స్థానిక కోర్టు హాలులో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు ఇబ్బంది కలుగకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించే ఈ విధానం మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడిటేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. అరుంధతి, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బృందగాన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం సాధించారని విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో శనివారం జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు హిందీ బృందగానంలో ఈ బహుమతి సాధించారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. స్కూల్ హెచ్ఎం సీహెచ్ నాగేశ్వరరావు, హిందీ టీచర్ షమీ మున్నీసా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ముదినేపల్లి రూరల్: బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు కలుగుతాయని, చట్టరీత్యా కూడా నేరమని కైకలూరు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ అన్నారు. బాల్యవివాహాలు, చిన్నవయస్సులో గర్భం దాల్చడం వలన కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపే వారితో పాటు వాటిని ప్రోత్సహించేవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎస్ఐ వీరభద్రరావు మాట్లాడుతూ పరిణితి చెందని వయస్సులో వివాహాలు చేయరాదన్నారు.

కుమార్ మాస్టార్ సేవలు ప్రశంసనీయం



పమిడిముక్కల: కుమార్ మాస్టార్ సేవలు ప్రశంసనీయమని హెచ్ఎం దుర్గాభవాని కొనియాడారు. పమిడిముక్కల హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన దీవి వెంకటేశ్వరకుమార్‌ను హెచ్ఎం, విద్యాకుటుంబం తరపున ఘనంగా సత్కరించారు.